క్లుప్తంగా

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న శ్రీనుబాబు

కాటారం : మండలంలోని పలు బాధిత కుటుంబాలను శ్రీపాద ట్రస్టు చైర్మన్, కాంగ్రెస్ యూత్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదివారం పరామర్శించారు. ధన్వాడ గ్రామానికి చెందిన నిమ్మల నర్సమ్మ మృతి చెందగా కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీనుబాబు వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ తవ్వకాలను అరికట్టాలి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల మైదాం కుంటలో అక్రమంగా చేపడుతున్న మట్టితవ్వకాలను అరికట్టాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దకోడెపాక గ్రామంలోని మైదాం కుంటలో ఇరిగేషన్ అధికారులు పర్మిషన్ ఇచ్చారంటూ ఓ కాంట్రాక్టర్ చలివాగు ప్రాజెక్టు కట్ట మరమ్మతుల కోసం ఇష్టారీతిలో తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. 10 ఫీట్ల మేరకు తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. మైదాం కుంట నుంచి రైతులు రాకపోకలు సాగిస్తున్న దారి ప్రక్కనే తవ్వకాలు జరుపడం వలన పశువులు, రైతులు మృతి చెందే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి నాగుల పవన్ కల్యాణ్, నాయకులు రాజు, సురేష్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



దామెర: కుల, మతాలకు అతీతంగా సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్‌విందు అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సైలానిబాబా దర్గాలో ఆదివారం ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్‌హమీద్‌కు ఖర్జూరా తినిపించి ఉపవాసం (రోజా) విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరుడు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. దర్గా అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, సీనియర్ నాయకులు సదిరం పోచయ్య, దామెర శంకర్, యూత్ నాయకుడు సుధాకర్, నాయకులు రాధాకృష్ణ, రాజేందర్, జక్కుల కుమార్, మహేందర్, ప్రేమ్, లింగారెడ్డి, బాబా దర్గా ప్రతినిధులు రషీద్‌బాబా, అమీర్ బాబా, ఎస్‌కే మోయినుద్దీన్, శ్రవణ్, ఖలీల్, పోతుల కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



మహదేవపూర్: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు



మహాముత్తారం: నిమ్మగూడెం అడవిలో నిఘా వాహనంతో పోలీసులు

- సీఐ రాజేశ్వర్‌రావు

మహదేవపూర్ : ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటాయని సీఐ రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అంబట్‌పల్లి గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో అనుమానితులు ఎవరైనా వస్తే పోలీసులకు తెలపాలన్నారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉన్నచో నేరుగా పోలీస్ స్టేషన్‌లో తెలపాలని, గ్రామంలో గుడుంబా, గంజాయి వంటి నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా ఇంట్లో సోదాలు చేయగా నిషేధిత గుడుంబా 25 లీటర్లు లభించింది. ఇక ముందు గుడుంబా విక్రయించినచో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని 22 వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు. సీటుబెల్టు పెట్టుకోవాలని, లైసెన్స్ పత్రాలు వెంట కలిగి ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఎస్సై ప్రసాద్, సీఆర్‌పీఎఫ్ సీఐ భాస్కరన్, సివిల్, టీఎస్‌పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సరళిపై నిఘా

మహాముత్తారం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని మారుమూల అటవీ గ్రామాలపై పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో ఎన్నికల అధికారి నియమించిన స్పెషల్ ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు ఆదివారం మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి, నిమ్మగూడెం అటవీ గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు అమర్చిన వాహనంతో తనిఖీలు చేపట్టారు. మద్యం, నగదు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



భిక్షపతి, అధ్యక్షుడు



జయాకర్, ఉపాధ్యక్షుడు

ములుగు రూరల్ : ములుగు జిల్లా శ్రీ బాలాజీ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో గట్టమ్మ ఆలయ సమీపంలో సంఘం సభ్యులు సమావేశమై నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన చింత నిప్పుల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా గండ్రత్ జయాకర్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి రవీందర్, కోశాధికారిగా తోట తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా గందె శ్రీను, డైరెక్టర్లుగా సురేష్, వేణు, రాజు, గందె మధు, రాజ్‌కుమార్ విజేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సిరికొండ బలరాంను సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ అధ్యక్షుడిగా ఆనందం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందం

మండలంలోని అబ్బాపూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నల్లెల్ల ఆనందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో జరిగిన సంఘం ఎన్నికలో ఎన్నికల కమిటీ సభ్యులు గాదె రాముడు, సుకరి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా సూరం పెద్ద కొమురయ్య, కార్యదర్శి ఆకుతోట లింగమూర్తి, సహాయ కార్యదర్శిగా తోట రాజేందర్, కోశాధికారిగా నల్లెల్ల శంకరయ్య, గౌరవ సలహాదారులుగా అనుమాండ్ల సుధాకర్, సూరం చ్నికొముురయ్య, కమిటీ సభ్యులుగా లింగస్వామి, సుధాకర్, రాజేశ్వర్‌రావు, మనోహర్‌రావు, దేవేందర్, జగ్గారావు, కిషన్‌లను ఎన్నుకున్నారు.

‘పార్టీపై బురదజల్లే ప్రయత్నం సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

ములుగు రూరల్ : ములుగు మండలంలోని ఇంచర్లలో వ్యక్తిగత విషయాలతో ఇద్దరు దాడులకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఇంచర్ల గ్రామంలో జరిగిన గొడవలో మామిడి అశోక్, శానబోయిన అశోక్ మధ్య వ్యక్తిగత గొడవలు ఉన్నాయని గతంలో శానబోయిన అశోక్‌పై మామిడి అశోక్ దాడి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. మామిడి అశోక్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎఫ్ఐఆర్‌లు కూడా ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు మామిడి అశోక్ వ్యవహారం అంతా తెలిసి కాంగ్రెస్ పార్టీ, మంత్రి సీతక్కపై దుష్ప్రచారం చేయాలని చూడడం సరికాదన్నారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులను పార్టీలో కొనసాగించడం కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. శానబోయిన అశోక్ బీఆర్ఎస్ పార్టీలో ఇమడ లేక ఎమ్మెల్యే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరాడని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. శానబోయిన అశోక్‌పై మామిడి అశోక్ తన అనుచరులతో దాడికి పాల్పడి కారు, ద్విచక్ర వాహనం ధ్వంసం చేశారని వివరించారు. ఆత్మరక్షణ కోసం శానబోయిన అశోక్ ప్రతిఘటించారన్నారు. పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అనవసర విషయాలలో కాంగ్రెస్ పార్టీని, మంత్రి సీతక్కను బద్నాం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి చాంద్‌పాషా, జిల్లా యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాజుయాదవ్, కుమార్ గౌడ్, కంబాల రవి, సీతారాంనాయక్, వంగ రవి, జయపాల్‌రెడ్డి, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని లివింగ్ గాడ్ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను ఆదివారం నిర్వహించారు. చర్చిపాదర్ సమ్మెల్ సన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పరిశుద్ధ బైబిల్ గ్రంథములోని యేసుక్రీస్తు బోధనలను భక్తులకు వివరించారు. క్రైస్తవులు ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మల్హర్‌లో..

మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లి బేతెస్థా చర్చిలో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఈస్టర్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్ భక్తులను ఉద్దేశించి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. యోసేబు సంగ, పేట దేవయ్య, గుర్రం బొందయ్య, సమ్మయ్య, స్వామి పాల్గొన్నారు.



మహదేవపూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

రన్ ఫర్ జీసెస్ ర్యాలీ

మహదేవపూర్ : మండలంలోని రాపల్లికోట, బేగ్లూర్ గ్రామాల్లో ఆదివారం పాస్టర్ల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీస్తు సమస్త మానవాళి కోసం సిలువలో మరణించి, మరణమును గెలిచి తిరిగి లేచాడని వివరించి సందేశం అందించారు. పాస్టర్లు జోసేఫ్, ప్రకాశ్, సురేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మల్హర్: వేడుకల్లో పాల్గొన్న పాస్టర్, క్రైస్తవులు

రేవూరిని విమర్శిస్తే గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

పరకాల : నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రజలు తరిమికొట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏడు సార్లు పోటీ చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని నర్సంపేటను అభివృద్ధి పథంలో నడిపించి నేడు పరకాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రకాశ్ రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. నిధుల మంజూరు లేకుండానే అభివృద్ధి పనుల పేరిటా మాయ మాటలు చెప్పిన చల్లా ధర్మారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. నిధులు ఉంటే పరకాల చలివాగు చెక్‌డ్యాం, కంఠాత్మకూర్ వంతెనలు ఏందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి ఎంటో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని సూరవీడు పంచాయతీ విజయపూరి కాలనీ సమీపంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ బోర్డర్ లో తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చర్ల, వాజేడు మండలాల నుంచి వచ్చి, వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులు ఎవరైనా తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

రేగొండ : ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా పట్టెం కోటిలింగం, ప్రధాన కార్యదర్శిగా ఆకుల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బండి కమలాకర్, పల్నాటి రాజు, కోశాధికారిగా రహీమ్‌పాషా, సహయ కార్యదర్శి సుంకరి శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా అంబాల రవీందర్, గౌరవ అధ్యక్షుడిగా నామాల రమేష్, కార్యవర్గ సభ్యులుగా బత్తిని ఆనంద్, బోయిని రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రెస్‌క్లబ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని వివరించారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, సమ్మయ్య, రాజు, రమేష్, రాకేష్, రణదీర్, ప్రవీణ్, మధు, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు



వాగునీటి అడ్డుకట్టను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



లీకేజీ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

- జీవనదిలా పారే వాగుకు అడ్డుకట్ట
- అధికారులు స్పందించాలని వేడుకోలు

మంగపేట : నిత్యం జీవనదిలా పారే ముసలమ్మ వాగు చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. దీంతో సుమారు నాలుగు గ్రామాలకు పూర్తిగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. మండలంలోని తిమ్మాపురం అటవీ ప్రాంతం నుంచి ముసలమ్మ వాగు రామచంద్రునిపేట, రాజుపేట, దేవనగరం, కత్తిగూడెం గ్రామాల సమీపం నుంచి సంవత్సరం పొడవునా జీవనదిలా పారుతోంది. కాగా ముసలమ్మ వాగులో ఆయా గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు మెస్ పాయింట్(బోరుబావి) నిర్మించారు. వేసవి కాలంలో వాగు నీటికి అడ్డుకట్టలు వేయడంతో మండుతున్న ఎండలకు వాగు పూర్తిగా ఎండిపోవడంతో మెస్ పాయింట్లలో నీరు లేక ఆయా గ్రామాలకు 20 రోజుల నుంచి తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో తాగునీరు లేక అల్లాడుతున్న ప్రజలు అధికారుల మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అయితే వాగునీటికి అడ్డుకట్టలు వేసి సాగునీటి కోసం రైతులు మళ్లించుకుంటున్నారు. గ్రామస్తులు, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, మరికొందరు గ్రామపెద్దల దృష్టికి తీసుకు పోయారు. అయినా స్పందన లేక పోవడంతో స్వయంగా పంచాయతీ సిబ్బంది, కొందరు గ్రామస్తులతో వెళ్లి వాగునీటికి అడ్డుకట్టలు వేసిన రైతులతో ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో వారంలో కనీసం రెండు, మూడు రోజులు నీటిని రాత్రి వేళల్లో వదలాలని లేదా నిత్యం కొంత వాగునీటిని వదిలే విధంగా రైతులు సహకరించాలని సర్దిచెబుతూ కొద్ది రోజుల నుంచి అడ్డుకట్టలను తొలిగిస్తు వస్తున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూడలేక ఆదివారం గ్రామస్తులతో వెళ్లి మళ్లీ అడ్డుకట్టలను తొలిగించారు.

నీటి సమస్య తీవ్రంగా ఉంది



ముసలమ్మవాగు నీటికి అడ్డుకట్టలు వేయడంతో సుమారు నాలుగు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. 20 రోజుల నుంచి కనీస అవసరాలను తీర్చుకునేందుకు నీరులేక ప్రజలు నరకాన్ని చూస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల నుంచి నీటిని కొనుగోలు చేసి తాగునీటితో పాటు అవసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలి.

- చందర్లపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్, రాజుపేట

గుంత.. తస్మాత్ జాగ్రత్త

- ప్రమాదకరంగా రోడ్డు పక్కన తవ్వకాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై తవ్విన గుంత

కన్నాయిగూడెం : మండలంలోని ప్రధాన రోడ్డును ఆనుకొని జియో నిర్వాహకులు పొక్లెయినర్‌తో భారీ గుంతలను తవ్వారు. ఈ గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే తుపాకులగూడెం, ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. కానీ గుంతలు తవ్విన జియో యజమాన్యం మాత్రం వాటి వద్ద ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకుండా అలాగే వదిలేసింది. దీంతో రాత్రి, పగలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉందోనని స్థానికులు అనుకుంటున్నారు. దీనికి తోడు ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం అటువైపు దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గుంతలు తీసిన ప్రాంతంలో ప్రమాదకర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.అలాగే అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

ప్రమాదకరంగా ఉన్నాయి



ప్రధాన రోడ్డుపై పొక్లెయినర్‌తో తవ్విన గుంతలు చాలా ప్రమాదంగా ఉన్నాయి. రాత్రి బైక్ పై వస్తే వెలుగులో కనపడటం లేదు. అక్కడ ఎలాంటి హెచ్చరిక గుర్తులు పెట్టలేదు. వెంటనే ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలి.

-నరెడ్ల అశోక్, స్థానికుడు

సమాచారం లేదు

రోడ్డుపై జియో సిగ్నల్ కోసం గతంలో భూమి లోపల కేబుల్ వేశారు. కానీ ఇప్పుడు గుంతలు తీస్తున్నట్లు మాకు సమాచారం లేదు. ఏమైనా ఇతర పనుల కోసం తీస్తున్నట్లు ఉంది. వెంటనే సంబంధిత యజమాన్యంతో మాట్లాడి గుంతల వద్ద భద్రత సూచికలు ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాము.

-రఘువీర్, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



విరాట్ (ఫైల్)

రేగొండ : మద్యం మత్తులో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడ విరాట్ (25) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి రాగా తల్లి మందలించింది. క్షణికావేశంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి గూడ రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.